తమ్ముడి విజయానికి అన్న ప్రచారం

- యాకుత్‌పురా నియోజకవర్గంలో జోరుగా ఎన్నికల ప్రచారం
- ఎంబీటీ అభ్యర్థి, తమ్ముడు అంజాదుల్లా ఖాన్ కోసం.. అన్న ఫర్హతుల్లా ఖాన్ ప్రయత్నం
- ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ఎమ్మెల్యేగా గెలువని వైనం

చార్మినార్: మజ్లిస్ పార్టీతో విభేదించి మజ్లిస్ బచావో తహరిక్(ఎంబీటీ) ఏర్పడిన అనంతరం గతంలో యాకుత్‌పురా శాసనసభ నియోజకవర్గంలో పాటు చాంద్రాయణగుట్ట శాసన సభ నియోజకవర్గాలలో ఎంబీటీ పోటీ చేసి విజయం సాధించారు. అయితే అన్నదమ్ములు ఏ ఒక్కసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా విజయం సాధించలేదు. పట్టువదలని విక్రమార్కుల లాగా ఈసారి తప్పని సరిగా యాకుత్‌పురా నియోజకవర్గం నుంచి విజయం కోసం అటు పార్టీ అభ్యర్థి అంజదుల్లా ఖాన్‌తో పాటు పార్టీ అధ్యక్షుడు ఫర్హతుల్లా ఖాన్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా తమ్ముని విజయం కోసం అన్న ఈసారి ఎన్నికల బరిలో నిలవకుండా అతడితో కలిసి జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు.


ఎన్నికల ప్రచారంలో అన్నాతమ్ముడు

ఈ సారి ఎలాగైనా..

అమానుల్లాఖాన్ కుమారులైన ఈ ఇద్దరు అన్నాతమ్ముళ్లు ఈసారి ఎలాగైనా యాకుత్‌పురా నియోజకవర్గాన్ని కైవసం చేసుకోవడానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. ఈ నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో ఎంబీటీ తరఫున పోటీ చేసి ఓటమి పాలైన ఆ పార్టీ అధ్యక్షుడు మాజీదుల్లా ఖాన్(ఫర్హత్‌ఖాన్) ఈసారి తన తమ్ముడికి ఇక్కడి నుంచి పార్టీ టికెట్ కేటాయించి జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. సభలు, సమావేశాలు, కార్నర్ మీటింగ్‌లు, పాదయాత్రలు.. ఇలా ప్రతిరోజూ తమ్ముడు అంజదుల్లాఖాన్‌తో కలిసి జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు.

సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీతో విభేదించి..

సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ, అమానుల్లాఖాన్‌లు మంచి మిత్రులు. 1992లో ఒవైసీతో విభేదించిన అమానుల్లాఖాన్ 1993లో మజ్లిస్ బచావ్ తహ్రీఖ్(ఎంబీటీ) అనే నినాదంతో కొత్తగా పార్టీని ఏర్పాటు చేశారు. అంతకు ముందు మజ్లిస్ పార్టీ అభ్యర్థిగా 1978, 1983, 1985, 1989లలో నాలుగుసార్లు చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఎంబీటీ పార్టీ ఏర్పాటు చేసిన అనంతరం 1994లో మళ్లీ చాంద్రాయణగుట్ట నుంచి విజయం సాధించారు. ఇక యాకుత్‌పురా నియోజకవర్గం నుంచి ఎంబీటీ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగిన ముంతాజ్ అహ్మద్ ఖాన్ కూడా ఎంబీటీ జెండాపై విజయం సాధించారు. అనంతరం ముంతాజ్ అహ్మద్ ఖాన్ మజ్లిస్ పార్టీ తీర్థం పుచ్చుకొని వరుసగా విజయం సాధించారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సామిత్రి పబ్లికేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత కూర చిదంబరం రచించిన జీవన చదరంగం, అనుభవాలు పాఠాలు అనే పుస్తకావిష్కరణ సభ శుక్రవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో జీవన స్థితిగతులపై రచయిత చక్కగా వివరించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు బొగ్గారపు దయానంద్, కవి విహారి, సాహితీవేత్త సుదామ, నేటినిజం సంపాదకులు బైస దేవదాస్, అఖిలభారతీయ భాషా సమ్మేళన్ తెలంగాణ శాఖ అధ్యక్షుడు కె.సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్‌లో రాజాసింగ్ ఓటమి ఖాయం


చుడిబజార్‌లో ప్రచారం చేస్తున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్, ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: పదేళ్లుగా గోషామహల్ అభివృద్ధిని విస్మరించిన రాజాసింగ్‌కు ఓటమి ఖాయం అయిందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. శుక్రవారం చుడిబజార్, బేదర్‌వాడి, జగన్నాథ్ మఠ్, బేగంబజార్, ఛత్రి తదితర ప్రాంతాల్లో ముమ్మరంగా పర్యటించి ఇంటింటా బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నందకిశోర్‌వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ..ఏ ప్రాంతానికి వెళ్లినా రాజాసింగ్‌ను తిడుతున్నారన్నారు. ఒక్కరోజు కూడా రాజాసింగ్ తమ ప్రాంతాలకు రాలేదని, కనీసం మౌలిక వసతులు కూడా చేపట్టలేదని ప్రజలు లబోదిబోమన్నారని ఆయన అన్నారు. తనను గెలిపిస్తే గ్రేటర్‌లోనే గోషామహల్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్, పరమేశ్వరీ సింగ్, క్రాంతికుమార్, పి.నరేందర్‌యాదవ్, ముఖేష్ ముదిరాజ్, సునీల్ సాహు, పప్పుమాత్రే, ప్రియాగుప్తా, వనిత, సంతోషి, రాజు యాదవ్, ప్రదీప్ రాజ్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


అవగాహన కరపత్రాలు అందజేస్తున్న ఏసీపీ శంకర్‌రాజు, ఇన్‌స్పెక్టర్ రవికుమార్

అబిడ్స్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించినప్పుడే ప్రమాదాలు జరుగవని బేగంపేట్ టీటీఐ ఏసీపీ జి.శంకర్‌రాజు పేర్కొన్నారు. శుక్రవారం అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌తో కలిసి మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు, సిబ్బందికి, అధ్యాపకులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేవారు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను ధరించాలన్నారు. విద్యార్థులకు చిన్నపటి నుంచే ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి కె.కృష్ణారావు, ప్రిన్సిపల్ ప్రభు, అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు, శ్రీకాంత్ గుప్తా, అడ్మినిస్ట్రేటీవ్ అధికారి సచ్చింద్రనాథ్‌తో పాటు దాదాపు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

దుస్తుల దుకాణంలో అగ్ని ప్రమాదం

దూద్‌బౌలి: మదీనా సర్కిల్‌లో ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన ఓ దుస్తుల షో రూమ్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా షో రూమ్‌లో అగ్ని ప్రమాదం సంభవించిందని చార్మినార్ పోలీసులు తెలిపారు. మంటలు పెద్ద ఎత్తున చెలరేగడంతో స్థానికంగా దట్టమైన పొగలు అలముకున్నాయి. మంటలు చూసిన వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగనప్పటికీ.. భారీ ఆస్తి నష్టం సంభవించినట్లు చార్మినార్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఆస్తి నష్టంపై ఎలాంటి ఫిర్యాదు అంద లేదన్నారు. విషయం తెలిసిన వెంటనే దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు.

నేడు మంత్రి కేటీఆర్ రోడ్డు షో

అబిడ్స్: మంత్రి కేటీఆర్ రోడ్డుషో ఈనెల 18న శనివారం జరుగనుంది. నాంపల్లి, గోషామహల్ నియోజకవర్గాల్లో కేటీఆర్ రోడ్డు షో నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఆనంద్ కుమార్ గౌడ్, నందకిశోర్ వ్యాస్ బిలాల్ తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటలకు మల్లేపల్లి చౌరస్తాలో కేటీఆర్ రోడ్డు షో ఉందని ఆనంద్‌కుమార్‌గౌడ్ వివరించారు. సాయంత్రం 5 గంటలకు మంగళ్‌హాట్ అనిత టవర్ వద్ద కేటీఆర్ రోడ్డుషో ప్రారంభమవుతుందని నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. అక్కడి నుంచి పురానాపూల్, బేగంబజార్ ఛత్రి, గౌలిగూడ మీదుగా పుత్లీబౌలి వరకు కేటీఆర్ రోడ్డు షో కొనసాగనుంది.

పద్మభూషణ్ ఎ.ఆర్.కృష్ణకు ఘన నివాళి



నాంపల్లి: ఎ.ఆర్.కృష్ణ మెమోరియల్ ట్రస్ట్ నిర్వహణలో పద్మ భూషణ్ ఎ.ఆర్.కృష్ణ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను శుక్రవారం రాత్రి నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి శుభాశీస్సులతో కళారత్న గుమ్మడి గోపాలకృష్ణ దర్శకత్వంలో 'శ్రీకృష్ణ రాయబార ఘట్టం' పద్యనాటకాన్ని ప్రదర్శించారు. విశ్రాంత ఆచార్యులు డాక్టర్ డీఎస్ఎన్ మూర్తి అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా వేమన ఫౌండేషన్ చైర్మన్, విశ్రాంత ఐపీఎస్ అధికారి చెన్నూరి అంజనేయరెడ్డి హాజరయ్యారు. ప్రజా–పద్యం సంస్థ ద్వారా సామాజిక ఇతివృత్తాలపై రచించిన ఆధునిక తెలుగు సాంఘీక పద్య నాటక రచనా పోటీల్లోని విజేతలకు జీజీకే ఫౌండేషన్ ద్వారా అశ్విని గ్రూపు చైర్మన్ బీసీహెచ్‌వీ సుబ్బారావు సౌజన్యంతో నగదు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కె.కృష్ణయ్య, సినీ నాటక రచయిత ఎం సంజీవి, జి.నెహ్రూ, ఏపీ నీలం, ఎన్టీఆర్ అవార్డు గ్రహీత మేనేజింగ్ ట్రస్టీ దుగ్గిరాల సోమేశ్వరరావు పాల్గొన్నారు.

క్యాట్ ఒలింపియాడ్‌లో ప్రతిభ



సాక్షి, సిటీబ్యూరో: ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన 'క్యాట్ ఒలింపియాడ్'పరీక్షలో మెహిదీపట్నంలోని శ్రీచైతన్య విద్యార్థులు విశేష ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.స్వాతి మాట్లాడుతూ..మొదటి లెవల్ పరీక్షలో 116 మంది ప్రతిభ చాటి రెండవ లెవల్‌కి ఎంపికయ్యారు. 6 నుంచి 10వ తరగతి వరకు నిర్వహించిన పరీక్షలో మ్యాథ్స్‌లో 37 మంది, ఫిజిక్స్‌లో 38 మంది, కెమిస్ట్రీలో 41 మంది ఎంపికయ్యారు. రెండవ లెవల్‌కి ఎంపికైన విద్యార్థులను అభినందించి, ప్రశంసాపత్రాలు అందించాం అన్నారు. ఈ కార్యక్రమంలో మెహిదీపట్నం జోన్ ఇన్‌చార్జి బి.కృష్ణ, కో ఆర్డినేటర్ ప్రవీణ్, డీన్ ఓంకార్, సీ బ్యాచ్ ఇన్‌చార్జ్‌లు నదీమ్, ఆంజనేయులు, ఒలంపియాడ్ ఇన్‌చార్జి రజనీ పాల్గొన్నారు.

బజార్‌ఘాట్ ఘటనలో పదికి చేరిన మృతులు

నాంపల్లి: బజార్‌ఘాట్‌లోని బాలాజీ అపార్ట్‌మెంట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు తహ(17) శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈనెల 13న సోమవారం ఉదయం బాలాజీ అపార్ట్‌మెంట్‌లో నిల్వ ఉంచిన కెమికల్ డబ్బాలకు మంటలు అంటుకు పెను ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది సజీవ దహనం కాగా మరొకరు తీవ్ర గాయాలతో ఉస్మానియా ఆస్పత్రిలో చేరారు. క్షతగాత్రుడు 80 శాతం కాలిన గాయాలతో నాలుగు రోజు పాటు ఆస్పత్రిలో పోరాటం చేశారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం తుదిశ్వాస విడిచారు.

బ్యాండ్ నిర్వాహకుడిపై హత్యాయత్నం

నాంపల్లి: బ్యాండ్ నిర్వాహకుడిపై కొందరు యువకులు హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన హబీబ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మాన్గార్‌బస్తీకి చందిన హెచ్.కర్మ అనే యువకుడు సీతారామ్‌భాగ్‌లో బ్యాండ్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి అతను దుకాణంలో ఉండగా అదే ప్రాంతానికి చెందిన కొందరు యువకులు ఒక్కసారిగా తల్వార్లు, రాడ్లతో దుకాణంలోకి వచ్చి అతడిపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో కర్మతో పాటు అతడి సోదరి దీప తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను పోలీసులు చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారిపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తి అరెస్ట్

విజయనగర్‌కాలనీ: చిన్నారిపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిని అరెస్టు చేసిన ఆసిఫ్‌నగర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్ జిర్రా రాయల్‌సీ హోటల్ ప్రాంతానికి చెందిన ఇసాక్(35) మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 15న రాత్రి ఓ బాలిక (8) చాక్లెట్లు కొనేందుకు ఇంట్లో నుంచి బయటకు వచ్చింది. గమనించిన ఇసాక్ బాలికను వెంబడించి లైంగిక దాడికి యత్నించడంతో చిన్నారి భయంతో కేకలు వేస్తూ పక్కనే ఉన్న షాపులోకి పరుగులు తీసింది. విషయం గమనించిన స్థానికులు అతడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

కార్వాన్‌లో బీఆర్‌ఎస్‌దే విజయం


మిత్రకృష్ణను ఆశీర్వదిస్తున్న మహిళ, చిత్రంలో అరుణ్‌కుమార్

జియాగూడ: కార్వాన్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ భారీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ అభ్యర్థి మిత్రకృష్ణ అన్నారు. శుక్రవారం జియాగూడ, కార్వాన్, కార్గిల్‌నగర్, ఇందిరానగర్, భరత్‌నగర్ తదితర ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'బీజేపీ విజయాన్ని ఏ పార్టీ అడ్డుకోలేదు'


దోశ వేసి ఓటు వేయాల్సిందిగా అభ్యర్థిస్తున్న అమర్‌సింగ్

జియాగూడ: కార్వాన్‌లో బీజేపీ విజయాన్ని ఏ పార్టీ అడ్డుకోలేదని నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి అమర్ సింగ్ అన్నారు. శుక్రవారం జియాగూడలోని ఇక్బాల్‌గంజ్, వెంకటేశ్వర్‌నగర్, దుర్గానగర్, సాయిదుర్గానగర్లలో ఇంటింటికి వెళ్లి ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ డైయిరీ సెల్ కన్వీనర్ శివ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకుడు దర్పల్లి నర్సింములు, ముచ్చింతల సత్యనారాయణ, అశోక్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే బడుగుల అభ్యున్నతి


బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని మహిళను అభ్యర్థిస్తున్న ఆనంద్‌కుమార్‌గౌడ్

విజయనగర్‌కాలనీ: బడుగుల అభ్యున్నతి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని నాంపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి సీహెచ్. ఆనంద్‌కుమార్ గౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నాంపల్లి నియోజకవర్గంలోని లక్ష్మీనగర్, శాంతినగర్, మాసబ్‌ట్యాంక్ తదితర ప్రాంతాల్లో గడప గడపకూ వెళ్లి కారు గుర్తుకే ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే బడుగు బలహీన వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. ఆయన వెంబడి సీహెచ్. లక్ష్మీనారాయణ, శీలం బాల్‌చందర్, సంజయ్, మల్లేపూల విద్యాసాగర్, రేణేశ్వర్ గౌడ్, వెంకటేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

పాతబస్తీకి బీజేపీ అవసరం


ప్రచారం నిర్వహిస్తున్న నరేష్

చార్మినార్: పాతబస్తీ అభివృద్ధి జరగడానికి బీజేపీని గెలిపించాల్సిన అవసరం ఉందని బహదూర్‌పురా బీజేపీ అభ్యర్థి వై.నరేష్ అన్నారు. శుక్రవారం ఆయన నియోజకవర్గంలోని పలు బస్తీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేసి ఈ ఎన్నికల్లో తనకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారాన్ని స్థానిక ఓటర్ల నుంచి మంచి స్పందన ఉందన్నారు.

మజ్లిస్ పార్టీతోనే ప్రజాభివృద్ధి


మాట్లాడుతున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

నాంపల్లి: ప్రజల అభివృద్ధి మజ్లిస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. నాంపల్లి నియోజకవర్గంలో పలు సంవత్సరాలుగా పెద్ద ఎత్తున అభివృద్ధి చేశామన్నారు. మల్లేపల్లి పరిసర ప్రాంతాల్లో మజ్లిస్ అభ్యర్థి మాజీద్ హుస్సేన్‌తో కలిసి ఆయన ముమ్మరంగా పర్యటించి ప్రచారం చేశారు. అనంతరం ఒవైసీ మాట్లాడుతూ.. మాజీద్ హుస్సేన్ 24/7 తరహాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవ చేస్తానన్నారు. మాజీద్ హుస్సేన్‌ను గెలిపిస్తే నాంపల్లి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అన్నివర్గాల ప్రజలకు మజ్లిస్ పార్టీ అండగా ఉండి నిరంతరం వారి ప్రగతికి, వారి సంక్షేమానికి, వారి అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని ఆయన అన్నారు.

కార్వాన్‌లో అమర్‌సింగ్ పాదయాత్ర


ప్రచారంలో బీజేపీ కార్వాన్ అభ్యర్థి అమర్‌సింగ్

గోల్కొండ: బీజేపీని ఓడించడానికి బీఆర్‌ఎస్, మజ్లిస్ కుమ్మక్కైయ్యాయని అయితే వారు ఎన్ని కుట్రలు పన్నిన తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ కార్వాన్ నియోజవర్గం అభ్యర్థి టి.అమర్‌సింగ్ అన్నారు. శుక్రవారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో పాదయాత్ర చేసి ఓటర్లను కలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. తమ పబ్బంగడుపుకోవడానికే సీఎం కేసీఆర్ మజ్లిస్‌కు వంత పలుకుతున్నారని ఆరోపించారు. ఓట్లను చీల్చి బీజేపీని ఓడించడానికి మజ్లిస్ పార్టీ సీఎం కేసీఆర్ ఆదేశాలతో డమ్మీ అభ్యర్థులను నిలబెట్టారని స్పష్టం చేశారు. మజ్లిస్ ఆగడాలకు చెక్ పెట్టాలంటే బీజేపీకి ఓటు వేసి తనను గెలిపించాలని ఆయన కోరారు.

కార్వాన్‌లో కాంగ్రెస్ ప్రచారం


ప్రచారంలో కార్వాన్ కాంగ్రెస్ అభ్యర్థి

గోల్కొండ: మజ్లిస్, బీజేపీ పార్టీలు ప్రజా వ్యతిరేకులని కార్వాన్ కాంగ్రెస్ అభ్యర్థి ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హాజీరి అన్నారు. శుక్రవారం ఆయన కార్వాన్‌లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఇంటింటికీ తిరిగి కలుసుకొని కాంగ్రెస్ అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నానని తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈసారి కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు. అంజద్, యాకూబ్, రహమాన్, నర్సింహ, రవి తదితరులున్నారు.

బీజేపీతోనే గోషామహల్ అభివృద్ధి


బేగంబజార్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, విక్రమ్‌గౌడ్, శంకర్‌యాదవ్

అబిడ్స్: పదేళ్లుగా గోషామహల్ నియోజకవర్గంలో తాను చేపట్టిన అభివృద్ధితోనే మరోసారి విజయం సాధిస్తానని గోషామహల్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. శుక్రవారం బేగంజార్ అశోక్‌మజార్ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ శంకర్‌యాదవ్, రాష్ట్ర బీజేపీ నాయకులు ఎం.విక్రమ్‌గౌడ్, బీజేపీ నేతలు రవీందర్ సింగ్, గోవింద్‌రాఠితో కలిసి ప్రచారం చేశారు. అనంతరం రాజాసింగ్ మాట్లాడుతూ..మజ్లిస్, బీఆర్‌ఎస్ ఒక్కటయ్యాయని ఆయన ఆరోపించారు. బీజేపీతోనే గోషామహల్ అభివృద్ధి జరుగుతుందన్నారు. ఎన్నికలు ఉన్నా లేకున్నా తానే నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉన్నానని పేర్కొన్నారు.

'మహిళా ఓట్లన్నీ నాకే'



చార్మినార్: ఈసారి జరిగే ఎన్నికల్లో చార్మినార్ నుంచి మహిళా అభ్యర్థిగా తానే పోటీ చేస్తున్నందున నియోజక వర్గంలోని మహిళల ఓట్లన్నీ తన ఖాతాలోనే పడతాయని చార్మినార్ బీజేపీ అభ్యర్థి మెఘారాణి తన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆమె తన అనుచరులు, కార్యకర్తలు, నాయకులతో కలిసి శుక్రవారం ఘాన్సీబజార్ డివిజన్‌లోని పటేల్ మార్కెట్, రికాబ్‌గంజ్, ఘాన్సీబజార్, మామాజుమ్లాఫాటక్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గం అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు.

'అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తా'


ప్రచారం చేస్తున్న పులిపాటి రాజేశ్ కుమార్

బహదూర్‌పురా: తనకు అవకాశం కల్పిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని బహదూర్‌పురా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పులిపాటి రాజేశ్‌కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆయన నాయకులు, కార్యకర్తలతో ప్రచారాన్ని నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

'సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ విజయానికి సహకరిస్తాయి'


మాట్లాడుతున్న మహ్మద్ సలావుద్దీన్ లోధీ

చార్మినార్: బీఆర్‌ఎస్ ప్రవేశపెట్టి అమలు చేసిన పలు సంక్షేమ పథకాలు తన విజయానికి దోహదం చేస్తాయని.. అందుకే నియోజకవర్గంలోని సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు ఎన్నికల ప్రచారాన్ని జోరుగా నిర్వహించాలని చార్మినార్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మహ్మద్ సలావుద్దీన్ లోధీ అన్నారు. శుక్రవారం పురానీ హవేలీలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డివిజన్లలో స్థానిక నాయకులు, కార్యకర్తలు ప్రతిరోజూ ఎన్నికల ప్రచారం నిర్వహించాలన్నారు.

బీఆర్‌ఎస్ పథకాలు దేశానికే ఆదర్శం


జాంబాగ్‌లో ప్రచారం చేస్తున్న ఆశీష్‌కుమార్ యాదవ్, ధన్‌రాజ్

అబిడ్స్: బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. జాంబాగ్‌లోని పలు ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ధన్‌రాజ్‌తో కలిసి ఆయన బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. అనంతరం ఆశీష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రభుత్వ ప్రగతి, సంక్షేమ పథకాలు దేశంలోని పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకున్న విషయం అందరికీ తెలుసన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేంకు అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ధన్‌రాజ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

చార్మినార్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి


ప్రచారంలో చార్మినార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముజీబుల్లా షరీఫ్

చార్మినార్: ఏళ్ల తరబడి అభివృద్ధిలో వెనుకబడిన చార్మినార్ శాసన సభ నియోజకవర్గం లోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తానని చార్మినార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహమ్మద్ ముజీబుల్లా షరీఫ్ హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నూర్ఖాన్ బజార్‌లోని షియా ముస్లింల ఓటర్లను కలిసి ఈ ఎన్నికల్లో చార్మినార్ నుంచి తనని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు చార్మినార్‌లో జరిగిన అభివృద్ధి అంతా దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో జరిగిందేనన్నారు. ఈ కార్యక్రమంలో అస్గర్ అలీ బేగ్, సలీం, అస్లముల్లా షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం


ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మొగిలి సునీతారావు

అబిడ్స్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి మొగిలి సునీతారావు అన్నారు. లక్ష్మీనగర్, అంబేద్కర్‌నగర్, మహాలక్ష్మీనగర్, శివలాల్ నగర్ తదితర ప్రాంతాల్లో ఆమె శుక్రవారం పర్యటించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుందన్నారు. పదేళ్లుగా ఎలాంటి అభివృద్ధి చేయని రాజాసింగ్‌ను చిత్తుగా ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో గోకరణ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంను చేయాలి


ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి ముప్పిడి సీతారాంరెడ్డి

చాంద్రాయణగుట్ట: సీఎం కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని బీఆర్‌ఎస్ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఇన్‌చార్జి ముప్పిడి సీతారాంరెడ్డి అన్నారు. ఉప్పుగూడలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మాట్లాడుతూ..హైదరాబాద్ నగరాన్ని సుందరంగా నిలిపేందుకు సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు హైదరాబాద్ విశ్వనగరం వైపు చూసేలా అభివృద్ధి చేస్తున్నారన్నారు. తనను గెలిపిస్తే నియోజకవర్గానికి అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

మజ్లిస్‌కు తిరుగు లేదు: కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పార్టీకి ప్రజా ఆదరాభిమానాలు ఉన్నాయని అందువల్లే కార్వాన్‌లో మజ్లిస్‌కు తిరుగులేదని కార్వాన్ సిట్టింగ్ ఎమ్మెల్యే, మజ్లిస్ అభ్యర్థి కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం గోల్కొండ మోతీదర్వాజ వద్ద మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం గోల్కొండ లక్కి హోటల్ వద్ద జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. 25 ఏళ్లుగా మజ్లిస్ పార్టీ ఒక్కటే కార్వాన్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. ఈసారి కూడా తాను భారీ మెజార్టీతో గెలిచి తీరుతానని ఆయన అన్నారు. ఆయన వెంట కార్పొరేటర్ నసీరుద్దీన్, పాషాభాయ్, షకీల్ అలీఖాన్, బదరుద్దీన్, ఏకే పటాన్ తదితరులున్నారు.


కౌసర్ మోహియుద్దీన్‌ను సన్మానిస్తున్న దృశ్యం